క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

బ్రహ్మంగారిమఠం : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో గురువారం ఎంపీపీ వీరనారాయణరెడ్డి అధ్యక్షతన మండల సర్వ సభ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంగమునిరెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరుకానున్నారని, ఈ సందర్భంగా అన్ని శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్

ప్రొద్దుటూరు క్రైం : ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇవ్వనున్నట్లు అమ్మవారి ఇండేన్ గ్యాస్ యజమాని సూర్యనారాయణాచారి తెలిపారు. ఉచితంగా మంజూరైన గ్యాస్ కనెక్షన్‌లను బుధవారం మహిళలకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉజ్వల యోజన ద్వారా గ్యాస్ కనెక్షన్ పొందిన మహిళలు రూ.300 రాయితీతో సిలిండర్ పొందవచ్చని తెలిపారు.

రైఫిల్ షూటింగ్‌లో రజత పతకం

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీకి చెందిన షేక్ జహర్‌తాజ్ రైఫిల్ షూటింగ్‌లో రజత పతకం అందుకుంది. అక్టోబర్ 29న రాజమండ్రిలో జరిగిన అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రైఫిల్ షూటింగ్ టోర్నమెంట్‌లో జహర్‌తాజ్ పాల్గొని ద్వితీయస్థానంలో నిలచిందని తల్లిదండ్రులు తెలిపారు. పార్లమెంట్ సభ్యులు మార్గానిభరత్ చేతుల మీదుగా వెండిపతకం తీసుకున్నట్లు వారు తెలిపారు. జహర్‌తాజ్ ప్రొద్దుటూరు పూజ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతున్నట్లు వారు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడుతాం

కాశినాయన : ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరంగా పోరాడుతామని ఎస్టీయూ నూతన కార్యవర్గ అధ్యక్షులు రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శి బాలఓబయ్య, ఆర్థిక కార్యదర్శి ప్రదీప్‌లు అన్నారు. బుధవారం నరసాపురంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ నిర్మలను కలిసి ఆమెతో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించారు. ఎంఈఓ నూతనంగా ఎన్నికైన వారిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సుబ్రమణ్యం, వాకా చంద్రశేఖర్, వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిరప పంట పరిశీలన

పోరుమామిళ్ల: మండలంలోని పుల్లివీడు పంచాయతీలో మిరపసాగును బుధవారం జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్, ఉద్యాన రాష్ట్ర సలహాదారు సంబటూరు ప్రసాదరెడ్డి అధికారులతో కలసి పరిశీలించారు. మిరప పంటను ఆశిస్తున్న చీడపీడల గురించి అడిగి తెలుసుకున్నారు. వర్షాభావ పరిస్థితులను అధిగమించడానికి డ్రిప్ పరికరాలు అమర్చుకోవాలని సూచించారు. మిరపలో తెగుళ్ల నివారణకు అధికారుల సలహాలు పాటించాలని రైతులకు సూచించారు. మంచిరకం మిరప విత్తనాలు ఆర్‌బీకేలకు సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. సందర్భంగా రైతులు పంటల బీమా పథకంలో మిరపను చేర్చాలని రైతులు కోరగా ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ప్రసాదరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉద్యానాధికారి శ్రీనివాసరెడ్డి, ఏరియా డ్రిప్ అధికారి మహేష్, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు విద్యార్థిని ఎంపిక

చాపాడు : మండల పరిధి అయ్యవారిపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకుంటున్న కె.సుజిని రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గుర్రప్ప తెలిపారు. గత నెల 28న కడప స్పోర్ట్స్ స్కూల్‌లో జరిగిన అండర్-17 హాకీ ఎంపిక పోటీలలో పాల్గొన్న కె.సుజిని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 3 నుంచి 5 వరకూ అనకాపల్లిలో జరుగనున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో సుజిని పాల్గొననున్నట్లు తెలిపారు.

పశు విజ్ఞాన బడిని సద్వినియోగం చేసుకోండి

రామాపురం : పశు విజ్ఞాన బడిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డైరెక్టర్ (ఏహెచ్) మాలకొండయ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కల్పనాయినిచెరువు గ్రామంలోని మూగిరెడ్డిగారిపల్లెలో పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో మాట్లాడుతూ పశువులు పట్ల జాగ్రత్తలు , మెలుకువలను రైతు సోదరులకు తెలియజేశారు. ప్రస్తుతం పశు సంవర్ధకశాఖలో అమలులో ఉన్నటువంటి నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ గురించి వివరించారు. రైతు భరోసా కేంద్రంలో పశువైద్య సహాయకులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని, పశువులకు తప్పకుండా డీవార్మింగ్ మందులను త్రాగించాలన్నారు. పశు విజ్ఞాన బడి కార్యక్రమంలో 34 ఆవులు, 12 ఏనుములు, 240 గొర్రెలు, మేకలకు వైద్యం అందించి పలు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం కల్పనాయినిచెరువు రైతు భరోసా కేంద్రాన్ని, గువ్వలచెరువు పశువైద్యశాలను పరిశీలించారు. కార్యక్రమంలో పశువైద్యులు విష్ణువర్ధన్‌రెడ్డి, పశు సంవర్ధక శాఖ సహాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల సేవలను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



ల్యాబ్‌లోని రక్తపరీక్షల మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : ప్రభుత్వ ఆస్పత్రుల సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. అందరూ ఆరోగ్యంగా జీవించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లా ఆస్పత్రి ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌ను బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు ప్రారంభించారు. ల్యాబ్‌ను పరిశీలించి పరికరాల పని తీరు గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. ఆరోగ్యం అన్నింటికంటే ప్రధానమైందని... సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కోవిడ్ సమయంలో ఏపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం పట్ల అత్యంత జాగ్రత్తలు తీసుకొని శక్తివంతమైన వైద్య సహాయాన్ని అందించిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రి దినదినాభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఆస్పత్రి ప్రాంగణంలో రూ.1.20 కోట్లతో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లో అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తారన్నారు. రక్తపరీక్షల ద్వారా అన్ని రకాల జబ్బులు, ఆరోగ్యానికి సంబంధించిన పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. క్యాన్సర్, థైరాయిడ్, ప్రెగ్నెన్సీ, లివర్, కిడ్నీ తదితర పరీక్షలు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇవే పరీక్షలు బయట చేయించుకోవాలంటే వేలాది రూపాయలు ఖర్చు అవుతుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులను ఉపయోగించుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రుల పట్ల కొందరిలో దురభిప్రాయం ఉందన్నారు. దానిని తొలగించుకోవాలని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన వచ్చిన తర్వాత జిల్లా ఆస్పత్రి శక్తి వంతమైన ఆస్పత్రిగా మారిందన్నారు. ఇక్కడ 24 గంటలు వైద్య సహాయం అందడమే కాకుండా, నిర్ధారణ పరీక్షలు కూడా ఏ సమయంలో వచ్చినా చేస్తారని తెలిపారు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వాసుపత్రికి రావాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. జిల్లా ఆస్పత్రిలో 100 శాతం నాణ్యమైన వైద్య సేవలు అందరికీ సమానంగా అందుతాయని తెలిపారు. ఆస్పత్రి పెథాలజిస్టు డాక్టర్ కవిత మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లో ఏక కాలంలో 80 మందికి 640 రకాల పరీక్షలను 1 గంట వ్యవధిలో చేయవచ్చని తెలిపారు. కొన్ని రకాల ముందస్తు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను కూడా చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే రాచమల్లు ల్యాబ్‌లో రక్త పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, హాస్పిటల్ కమిటీ మెంబర్ కొండా ధనలక్ష్మి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ హిమదేవి, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ రాణమ్మ, కౌన్సిలర్ కమాల్‌సాహెబ్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం



బంకపాలెంలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం కనిపిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డులో గల బంకపాలెం, ఎగువపాలెం, దిగువపాలెంలలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్య, వైద్యం, మహిళల సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు దేశంలో ఎక్కడా అమలులో లేని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. ఈ నాలుగున్నర ఏళ్ల కాలంలో ఇప్పటికే ప్రతి కుటుంబానికి రూ.1.50 లక్షల నుండి రూ.2 లక్షల వరకు లబ్ధి చేకూరిందని, రాబోవు రోజుల్లో మరింత లబ్ధి చేకూరనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్ రామిరెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు శ్రీనివాస్‌యాదవ్, బిజ్జంరమణ, అనిల్, ఆవులశ్రీను, తిరుపతి రెడ్డి, గోగులప్రసాద్, ఓబులేసు, శివ, బాబు, డాక్టర్ శ్రీను, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, రూరల్ ఎస్‌ఐ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బి.కోడూరు : రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అంది ప్రజలు అభివృద్ధి చెందడంతో పాటు రాష్ట్రం పారిశ్రామికంగానూ, ఆర్థికంగానూ బలోపేతం కావాలంటే మళ్ళీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవడం తథ్యమని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. బుధవారం పోరుమామిళ్ళలోని పద్మావతి కల్యాణ మండపంలో బి.కోడూరు, కాశినాయన మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, వలంటీర్లతో ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమానికి సంబంధించి సమావేశం నిర్వహించారు. ముందుగా మహానేత వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు అందాయని తెలిపారు. అర్హులందరికి ఇళ్ళ స్థలాలను మంజూరు చేసి ప్రభుత్వమే ఆ ఇళ్ళను నిర్మించి ఇస్తున్నట్లు వారు తెలిపారు. అన్ని సచివాలయాల పరిధిలో ఎందుకు ఆంధ్రకు జగనే కావాలి కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఇందుకోసం పార్టీ మండల అధ్యక్షులు, మండల సచివాలయాల కన్వీనర్, గృహసారధులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్ళి ప్రజలకు అవగాహన కల్పించి 2024లో తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్నందున నిరంతరం ప్రజలతోనే ఉండి అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని తెలిపారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ కోడూరుచెన్నమ్మ, మండల ఉపాధ్యక్షులు మాధవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నరసింహారెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీనరసారెడ్డి, జయరామిరెడ్డి, పీరయ్య, రామసుబ్బారెడ్డి, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం



వాసుదేవపురంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న ఉద్యాన అధికారులు, సర్పంచ్

కాశినాయన : రైతులకు ఆయిల్‌పామ్ సాగు లాభదాయకంగా ఉంటుందని ఉద్యాన అధికారి శ్రీనివాసులరెడ్డి, సువేన్‌ఆగ్రో కంపెనీ జనరల్ మేనేజర్ కొండారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని వాసుదేవపురం గ్రామానికి చెందిన జీ.దొరబాబు పొలంలో ఆయిల్‌పామ్ మొక్కలను నాటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో మొదటిసారిగా 5 మండలాల్లో ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందన్నారు. కాశినాయన, బి.మఠం, మైదుకూరు, ప్రొద్దుటూరు, పులివెందుల మండలాల్లో 200 హెకార్టల్లో ఉద్యాన పంటగా ఆయిల్‌పామ్ పంటను సాగు చేసేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందన్నారు. మొక్కలు నాటిన 4 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల వరకు నిరంతర ఆదాయాన్ని ఈ పంట అందిస్తుందన్నారు. పంట సాగుకు ప్రభుత్వం రాయితీ అందించడంతో పాటు పంట దిగుబడి వచ్చిన తర్వాత దళారీల ప్రమేయం లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కంపెనీ వారి నుండి నేరుగా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సంచాలకులు మురళీధర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, ఎంఐఓ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

ప్రొద్దుటూరు క్రైం : వ్యాయామంతో ఆరోగ్యవంతులుగా ఉండొచ్చని డాక్టర్ మహాలక్ష్మి తెలిపారు. కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని సోములవారిపల్లె రెండో సచివాలయంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత ఆరోగ్య సమాచారం అనే పుస్తకాన్ని ప్రజలకు పంపిణీ చేశారు. డాక్టర్ మహాలక్ష్మి మాట్లాడుతూ ఈ కరదీపికలో సామాన్య ప్రజలకు అవసరమైన ఆరోగ్య పరమైన సమాచారం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇందులోని సమాచారాన్ని అవగాహన చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీవీ వరప్రసాద్, యంఎల్‌హెచ్‌పీ గంగా తులసి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్చకులకు నెలకు రూ.10 వేలు ఇవ్వాలని విజ్ఞప్తి

పోరుమామిళ్ల : ముఖ్యమంత్రి అర్చకులకు నెలకు రూ. 5 వేలు ఇస్తున్నారని, అయితే దాన్ని రూ. 10 వేలకు పెంచాలని పోరుమామిళ్ల గాయత్రీ బ్రాహ్మణ సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. బుధవారం ఆ సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న 5 వేలలో రూ. 2 వేలు ధూప, దీప నైవేద్యాలకు ఖర్చవుతుందని, మిగతా రూ. 3 వేలు కుటుంబ అవసరాలకు సరిపోవడం లేదన్నారు. అందువల్ల దయతో ప్రభుత్వం నెలకు రూ. 10 వేలు ఇవ్వాలని కోరారు.దీనికి సంబంధించిన వినతిపత్రాలు ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, రాష్ట్ర దేవదాయశాఖ మంత్రికి ఇచ్చినట్లు తెలిపారు.

వరిపంట పరిశీలన

బి.కోడూరు : మండలంలోని తుమ్మలపల్లె, మేకవారిపల్లె, అంకనగొడుగునూరు గ్రామాలోల తెగులు సోకిన వరిపంటను బుధవారం కడప నుండి వచ్చిన శాస్త్రవేత్తల బృందం పరిశీలించి తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ వరిపంటలో పాము పొడ తెగులు, సుడిదోమ తెగులు ఉధృతి ఉందన్నారు. పాముపొడ తెగులు నివారణకు హెక్సాకోనోజోల్ 2ఎంఎల్ ఒక లీటరు నీటికి, లేదా ప్రోపికోనోజోల్ 1ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏటీఎంఏ పీడీ విజయలక్ష్మి, ఎఫ్‌టీసీ డీడీఏ రమణారెడ్డి, పోరుమామిళ్ళ డివిజన్ ఏడీఏ మురళీధర్‌రెడ్డి, ఎఫ్‌టీసీ ఏఓ శివశైలజ, బి.కోడూరు ఏఓ కౌశిక పాల్గొన్నారు.

బీజేపీ అవకాశవాద రాజకీయాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్

బద్వేలు అర్బన్ : బీజేపీ అవకాశవాద రాజకీయాలను తిప్పికొట్టేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణభేరి బస్సుజాత బుధవారం బద్వేలుకు చేరుకుంది. ఈ సందర్భంగా నాలుగు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ పేదవర్గాల నడ్డి విరుస్తోందన్నారు. రాష్ట్ర విభజన సమయంలో రాష్ట్రానికి పదేళ్ళ పాటు ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ వంటి హామీలిచ్చిన బీజేపీ ప్రభుత్వం వాటన్నింటిని విస్మరించిందన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్య, ఉమామహేశ్వర్‌రావు, రమాదేవి, క్రిష్టయ్య, రాణి, జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, పట్టణ కార్యదర్శి సభ్యులు చాంద్‌బాష, నాగేంద్రబాబు, భైరవప్రసాద్, ఖాదర్‌బాష, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బద్వేలు అర్బన్ : మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. ఈ నెల 3, 4, 5వ తేదీల్లో కర్నూలులోని రావూరిగార్డెన్స్‌లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫిష్‌ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలను బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్స్య ఉత్పత్తుల వినియోగం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. చేపల వాడకం ద్వారా ఆరోగ్యకరంగా ఉండవచ్చని, ఇందుకోసమే ప్రభుత్వం చేపల ఉత్పత్తులను పెంచేందుకు ఫిష్‌ఆంధ్ర రిటైల్ షాపులను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఈ ఫుడ్ ఫెస్టివల్‌లో వివిధ రకాల చేపల రుచికరమైన వంటకాలతో కూడిన అపరిమితమైన భోజనం కేవలం రూ.399లు మాత్రమేనని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సింగసానిగురుమోహన్, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షులు మిరప్పల్లెవెంకటరమణ, మత్స్య సహకార సంఘం పట్టణ ఉపాధ్యక్షులు నాగేంద్రరావు, సెక్రటరీ వెంకటయ్య, మత్స్య సహాయకులు వై.కొండయ్య, సంఘం డైరెక్టర్లు చంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.

దాతృత్వం చాటుకున్న ఉపాధ్యాయుడు



పరీక్షల ఫీజు మొత్తాన్ని హెడ్మాస్టర్‌కు అందిస్తున్న గణిత ఉపాధ్యాయుడు రాధా నరసింహారాజు

మైదుకూరు : మైదుకూరులోని జెడ్పీ హైస్కూల్ (బాలికల)లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.రాధా నరసింహారాజు తన దాతృత్వాన్ని చాటుకున్నారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 81 మంది విద్యార్థినులకు 10వ తరగతి పరీక్షల ఫీజును ఆయన చెల్లించారు. పరీక్షల ఫీజు మొత్తం రూ.10,125లను ఉపాధ్యాయుడు బుధవారం పాఠశాల హెడ్మాస్టర్ ఎస్‌జీ భవానిదేవికి అందజేశారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ మాట్లాడుతూ గణిత ఉపాధ్యాయుడు రాధా నరసింహారాజు విద్యార్థినులకు పరీక్షల ఫీజు చెల్లించి ఆదర్శంగా నిలిచారన్నారు. ఉపాధ్యాయుడు మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాల (గతంలో కోఎడ్యుకేషన్) రుణం తీర్చుకునేందుకే విద్యార్థినుల ఫీజు చెల్లిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థినులు బాగా చదివి పరీక్షల్లో మంచి మార్కులతో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు.

'జగనన్నకు చెబుదాం'తో సమస్యలు పరిష్కారం

చాపాడు : ఈనెల 3న చాపాడు మండల కార్యాలయం వద్ద జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీని ద్వారా ప్రజల సమస్యలు సత్వరమే పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయరామరాజుతోపాటు అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. మండల పరిధిలోని ప్రజలు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రతి సమస్యకు సత్వరమే పరిష్కారం లభిస్తుందని ఆయన తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

గోపవరం : జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చే యాలని ఎంపీడీఓ హసీనా పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం రాచాయపేట జగనన్న కాలనీలో ఇళ్ళ ని ర్మాణాలను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల ని ర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులతో మాట్లాడారు. డిసెంబర్ 31వ లోపల జరుగుతున్న ఇళ్ళ నిర్మాణాలన్నీ కూడా పూర్తి చేసేందుకు ఇప్పటి నుండే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని హౌసింగ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మండల వ్యాప్తంగా 54 ఇళ్ళ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, ఇళ్ళు పూర్తయితే అనుకున్న లక్ష్యానికి చే రుకుంటామని తెలిపారు. ఎప్పటికప్పుడు పనులను హౌసింగ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పర్యవేక్షించాలన్నారు.

పొట్టిశ్రీరాములు త్యాగం నేటి తరానికి ఆదర్శం



పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య వర్తక సంఘం నాయకులు



లైట్‌పాలెం సెంటర్‌లో నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్యసభ సభ్యులు



మైదుకూరులో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

బద్వేలు అర్బన్ : రాష్ట్రం కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం నేటి తరానికి ఆదర్శం కావాలని, ఆయన ఆశయ సాధన కోసం నేటి యువత కృషిచేయాలని ఆర్యవైశ్య వర్తకసంఘం అధ్యక్షులు కె.వి.సుబ్బారావు పేర్కొన్నారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం చేసి అనంతరం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి ఆత్మత్యాగఫలితంగానే ఆంధ్రరాష్ట్ర అవతరణం జరిగిందని అన్నారు. ప్రతిఒక్కరు పొట్టిశ్రీరాములును స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యవర్తక సంఘం ఉపాధ్యక్షులు చలమయ్య, జాయింట్ సెక్రటరీలు సురేష్‌బాబు, వైభవ్‌ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో..

ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టిశ్రీరాములు మహనీయులని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ మీనాక్షిరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేసి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి బ్రహ్మయ్య, కోశాధికారి గంగన్న, గౌరవ సలహాదారులు పుల్లంరాజు, ఉపాధ్యక్షులు రామసుబ్బారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిచ్చయ్య, సుబ్బరాయుడు, గురుస్వామి, ఆనందరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి నివాళి

ప్రొద్దుటూరు కల్చరల్ : అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలితమే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని పలువురు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక లైట్‌పాలెం సెంటర్‌లోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలు సంఘాల నాయకులు వేర్వేరుగా పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసభ కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, కోశాధికారి మిట్టా శంకర్, మీడియా కమిటీ కన్వీనర్ సీవీ సురేష్, కార్యవర్గ సభ్యులు, అవోపా పట్టణాధ్యక్షుడు గుండా పద్మనాభయ్య, కార్యదర్శి పచ్చిపులుసు నరసింహారావు, కోశాధికారి జయం రమేష్, ఉపాధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు, సభ్యులు, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, రచయిత జింకా సుబ్రహ్మణ్యం, మధుసూదన్‌బాబు, నాగేశ్వరరావు, శ్రీనివాసులు, సూరారెడ్డి, యడవల్లి రమణయ్య, రామగోవిందరెడ్డి, హరి తదితరులు పాల్గొన్నారు.

అమర జీవికి ఘన నివాళి

మైదుకూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం అమరజీవి పొట్టి శ్రీరాములుకు పలు కార్యక్రమాలలో ఘన నివాళి అర్పించారు. ఆర్యవైశ్య సభ ఆధ్వర్యంలో అమ్మవారిశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తర్వాత మార్కెట్ కూడలిలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అవోపా అధ్యక్షుడు దరిశా శ్రీనివాసులు, ఆర్యవైశ్యసభ నాయకులు యలవలి హరికిషన్, దొంతు వెంకట సుబ్బయ్య, ఎలిశెట్టి గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, అధ్యాపకులు, పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం చేసిన త్యాగాన్ని విద్యార్థులకు వివరించారు.